# వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణం


స్వామి అమ్మవార్ల జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్19 : యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. గంటన్నరపాటు సాగిన కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నారసింహుడికి నిత్యోత్సవాలను అర్చకులు తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. స్వామివారికి సుప్రభాత సేవ, తిరువారాధనలు, నిజాభిషేకం జరిపిన అర్చకులు తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనం, అమ్మవారిని తిరుచ్చీవాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. దర్బార్ సేవలో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి వేంచేపు చేశారు. అనంతరం స్వామివారిని గర్భాలయంలో వేంచేపు చేశారు. ముఖమండపంలో సువర్ణమూర్తులకు బంగారు పుష్పార్చనలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా జరిగిన సువర్ణ పుష్పార్చనల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. పాతగుట్ట ఆలయంలో స్వామి వారి నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి.10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం లక్ష్మీ అష్టోత్తరం, లలిత సహస్రనామార్చన, పారాయణం, జపాలు, కుంకుమార్చన, కైంకర్యాలు ఘనంగా జరిగాయి. లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఖజానకు రూ.17,34,731ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశికధర్మకర్త నరసింహమూర్తి వెల్లడించారు.

## మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

యాదగిరిగుట్ట, అక్టోబర్19 : మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, ముచ్చటగా మూడోసారి గొంగిడి సునీతను గెలిపించి ఆలేరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో గుండాల మండలం మాసాన్‌పల్లిలో 100 మంది, ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 9 ఏండ్లలో రూ.5 వేల కోట్లతో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అభివృద్ధి చేసి చూపిందన్నారు. ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి రూ. 25 లక్షల అభివృద్ధి అయినా చేశారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. గతంతో పోలిస్తే గ్రామాల్లో అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై ప్రజలు పూర్తి నమ్మకంతో ఉన్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉండాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే 24 గంటల విద్యుత్, దళితబంధు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, రైతు బీమా, ఆసరా పింఛన్లు నిలిచిపోతాయని అన్నారు. ఎన్నికల వేళ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గుండాల మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, శారాజీపేట సర్పంచ్ బండ పద్మాపర్వతాలు, ఉప సర్పంచ్ కంతి మహేందర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండ మహేందర్, సెక్రటరీ జనరల్ రాంనర్సయ్య, నాయకుడు మొరిగాని అశోక్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు కిమిడి సిద్ధేశ్వర్, యూత్ గ్రామశాఖ అధ్యక్షుడు చిలుకు ప్రశాంత్, మాజీ ఎంపీపీ సంగి వేణుగోపాల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గడ్డమీది పాండరిగౌడ్ పాల్గొన్నారు.


హాలియాలో కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

## మూడోసారి బీఆర్ఎస్‌దే అధికారం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్
- కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

హాలియా, అక్టోబర్ 19 : ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. గురువారం తిరుమలగిరి(సాగర్) మండలం నాయకునితండాకు చెందిన 3 కాంగ్రెస్ కుటుంబాలు, నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడేనికి చెందిన 4 కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో హాలియాలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ర్టాల్లో రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు లేవన్నారు. గడిచిన రెండున్నరేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,500 కోట్ల పైచిలుకు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సఫావత్ సైదా, సోమ్లా, నగేశ్, మస్తాన్, దోరేపల్లి రామచంద్రు, రజియా తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటి సత్యపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, నాయకులు జాల పాపయ్య, పెద్దిరాజు, హరిరాం, శ్రీను, రతన్, రవి పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్
- కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక

బొమ్మలరామారం, అక్టోబర్19 : వచ్చే ఎన్నికల్లో అధిక మెజార్టీతో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ బొమ్మలరామారం గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కదువ్వ ఉపేందర్ ఆధ్వర్యంలో భిక్షమయ్యగౌడ్ సమక్షంలో గురువారం 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రాల లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ జూపల్లి భరత్, మైలారం రామకృష్ణ, గురువారెడ్డి, పాపిరెడ్డి, శాంతా చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## కాంగ్రెస్ గ్యారెంటీ హామీలు నవ్వుల పాలు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19 : కాంగ్రెస్ గ్యారెంటీ హామీలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు తప్ప నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అరవై ఏండ్లు ఆగం చేసి కొత్తగా నెరవేర్చలేని హామీలతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న ఆ పార్టీలో ఉండబట్టలేక గులాబీ గూటికి చేరుతున్నారన్నారు. సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్) మండలాల పరిధిలోని భావ్‌సింగ్‌తండా, కుప్పిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన 97 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీలో చేరగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణ మాదిరిగా అందించడం లేదనే విషయం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అక్కడ ప్రజలకు ఇవ్వలేని హామీలను తెలంగాణలో గెలిపిస్తే ఇస్తామనే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మరన్నారు. 60 ఏండ్లకు పైగా పాలించిన సమయంలో తెలంగాణకు గొప్పగా చేసిందేమీ లేదని, ఇప్పుడేదో కొత్తగా చేస్తామంటే అంతా నవ్వుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ఆయనే తెలంగాణకు సరైన నాయకుడని ప్రజలంతా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని, కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుప్పిగంతులు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చేరిన వారిలో కనుకు ఎల్లయ్య, కనుకు దామోదర్, వెంకటేశ్, ఊటుకూరి నరేశ్, రాంపంగి గోపి, కనుకు మనోజ్, అనసూర్యమ్మ, శైలజ, రమణ, రాజు, రాకేశ్‌తోపాటు 97 మంది ఉన్నారు.


గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

మర్రిగూడ, అక్టోబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగానే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో నామాపురానికి చెందిన బీజేపీ నాయకులు ఐతరాజు గణేశ్, శంకర్ సహా పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కూసుకుంట్ల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత, కొత్త తేడా లేకుండా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేశ్, సహకార సంఘం చైర్మన్ బాలం నర్సింహ, గ్రామశాఖ అధ్యక్షుడు బట్టు వెంకటేశ్, యూత్ అధ్యక్షుడు మద్ది శంకర్, నవీన్, సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే పైళ్ల

భువనగిరి అర్బన్, అక్టోబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 27వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం నాయకులు 20 మంది ఎమ్మెల్యే సమక్ష్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి వలసలు పెరిగాయని పేర్కొన్నారు. 27వ వార్డు అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. భువనగిరిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. చేరిన వారిలో నాజిమ్, అజీజ్, ఖాజా, అన్వర్, అస్లాం, సైఫ్, జమీల్, అక్బర్, జాకీర్, మొయిజ్, నయీమొద్దీన్, ఒమన్, షౌకత్, ముజాహిద్, అఖిల్, రహీం, జలీల్, ఇమ్రాన్ ఉన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, 30వ వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమొద్దీన్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు కాజమ్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అఫ్జల్, ఇక్బాల్ పాల్గొన్నారు.